
# మిత్ర సంతర్పణలు అను ప్రైవేటు మాష్టారు విజయం



**పెండ్యాల నాగాంజనేయులు**

“హాఁ! అంటూ బోర్లాపడ్డాడు సర్వయ్య.

'అయ్యబాబోయ్' అంటూ వెల్లికిలా బడ్డాడు కైలాసం.

'మహాప్రభో' అంటూ మూర్ఛబోయాడాచారి.

'హోరి భగవంతుడా' అంటూ తెల్లమొహంవేసి కళ్ళప్పగించి చూశాడు అవతారం—గుండెలు దడదడలాడుతుండగా.

ఇదంతా జరిగినప్పుడు ఆచారి నోట్లో గుత్తొంకాయ, సర్వయ్య నోట్లో మామిడికాయపప్పు, కైలాసం నోట్లో దోసావకాయ, అవతారం చేతిలో మజ్జిగ పులుసుగిన్నె వున్నాయి.

ఈ పదార్థాలన్నీ తెచ్చినవాడు అవతారం — సృష్టించింది అతని అర్ధాంగి సుందరమ్మ.

నాలుగేళ్ళుగా తాలుకాఫీసులో గుమాస్తా హోదాలో తాసిల్దారు చేత చివాట్లుతింటూ, హోటళ్ళలో గడ్డిమేస్తున్న అవతారానికి భార్య కాపురానికి రావడంతో అంతకు ముందురోజునుంచే అన్నప్రాప్తి కలిగింది.

అందుకే ఆఫీసుకు అన్నం మూట గట్టుకొచ్చాడా రోజు.

ఆఫీసులో బూతులూ, లంచాలూ భోంచేస్తూ ఇంటికెళ్ళి అన్నం తింటూండే సర్వయ్య, ఆచారి, కైలాసం—వెధవ తిండిమొహం ఎరగ వట్టు ఆ అన్నంమూటమీది కెగబడ్డారు మధ్యాహ్నం భోజనాల వేళలో.

అందుకూ ఇంత గొడవ !

ఎక్కడ్నించో ఓ కాకివచ్చి అవతారం చేతిలోని పులుసుగిన్నె తన్నడం, అందులో సరుకంతా అందరి ముఖాలమీదకీ పంపిణీ కావడం జరిగితేగాని ఒక్కళ్ళూ ఈ లోకంలోకి రాలేకపోయారు.

అవతారం గుండెదడ సర్దుకుంది.

'అమ్మయ్య! బతికారుగదా. ఒకొక్కడూ తలోటీ నోట్లో పెట్టుకోగానె ఆర్తనాదాలు చేస్తూ పడిపోతేనూ విషపదార్థాలెమోనని భయపడ్డాను' అన్నాడు గుండెమీద ఎడంచేత్తో రాసుకుంటూ — సంతోషంగా నిట్టూరుస్తూ.

'రేయ్! నీ నాలుక వేయిచీలికలు చేస్తాను. ఈ గుత్తొంకాయ విషపదార్థంట్రా. ఆ మహాసతి అనసూయ మాత్రం ఇంతబాగావండగలదురా?' అంటూ ఆచారి గుడ్లెర్ర జేశాడు

మీసం తిప్పడం మొదలెట్టాడు కైలాసం దోసావకాయ రుచికి లొట్టలేస్తూ.

లాల్చీ చేతులు మడవసాగాడు సర్వయ్య: మూతిచుట్టూ అంటుకున్న మామిడిపప్పును నాలుకతో గొంతులోకి ఈడుస్తూ.

అవతారానికి విషయం అర్థమైంది. వాళ్ళంతా తనభార్య వంటు నింతగా మెచ్చుకుంటున్నందుకు ఒళ్ళు చేయడం మొదలెట్టాడు. ఆ కారణంగా తొడుక్కున్న గుడ్డలు చిరిగిపోతాయేమోనని భయపడి కాస్త తమాయించుకున్నాడు.

'మీరంతా ఇంత గొప్పగా ఎందుకు పొగుడుతున్నారో నాకేం అర్థం కావడంలేదు. దానిమొహం వంటు అదీనూ! మా ఆడంగుల వంటు ముందు ఈ వంటెంత? వెధవదీ...' అంటూ సాగదీశాడు — మరోసారి వాళ్ళు పొగిడితే వినాలని.

ఆచారికి ఛర్రుమంది. 'ఒరేయ్! వెధవ కూతలు కుయ్యకు! మా యావిడ వండిన గుత్తొంకాయకూర నువ్వెప్పుడన్నా తిన్నావా? తిన్నావా అని? అదే గనక నువ్వు తినగలిగితే ఈ పంగనామాలు చెరిపేసి వీభూతి పెట్టుకుంటా! "శివలింగం" అని పేరెట్టుకుంటా!! పిలక చెరిపేసి క్రాపింగు చేయించుకుంటా!!! నున్నటి ఈ మూతిమీద ఫ్రెంచికటింగ్ మీసం ఎరువేసి పెంచుతా. ఇదే పందెం!

ఇదే నా ప్రతిజ్ఞ! ఏమంటావ్ ?' అన్నా డెగిరిపోతూ.

'భ ఛ! ఎందుకులేరా అంతంత ప్రతిజ్ఞలు!' అన్నా డవతారం లోపలే సంతోషపడిపోతూ.

ఇహ సర్వయ్యకు ఛాన్సు దొరికింది. 'వాడిదంతా వట్టి చొల్లు! వాళ్ళావిడవంట అదిరిపోతుంది. కానీ, మా యావిడచేసే వంటకాల్లో రంగుని బట్టిగాని, రుచినిబట్టిగాని' వాసననిబట్టిగాని 'ఇది ఫలానా పదార్థం' అని గుర్తుపట్టగలిగితే నేనీ అప్పర్ డివిజన్ గుమాస్తాలోంచి లోయరు డివిజన్ గుమాస్తాలోకి దిగజారిపోతా! తిని వాంతి చేసుకోకుండావుంటే నేను పశ్ఛేలంచాల ధరలుపెంచి అవన్నీ నీకే ధార పోస్తా జీర్ణించుకోగలిగితే. నా సీట్లో కాగితాలన్నీ మురగబెట్టి,ఆఫీసరుతో చీవాట్లుతిని, ఛార్జిలు ఫ్రేంచేయించుకుంటా! ఇది నా ప్రతిజ్ఞ! ఏమంటావ్ మరి?' అంటూ అవతారం వీపుమీద చరిచాడు.

అవతారానికి మరో డిగ్రీ సంతోషం పెరిగింది. 'ఎందుకురా పాపం ఆ ఇల్లాలినలా చిన్న బుచ్చుతావూ ?' అంటూ మందలించపోగాడు.

'ఒరేయ్ అవతారం! వాళ్ళిద్దరి మాటలూ నమ్మకు! నే తిన్నాగా! బ్రహ్మాండంగా వండుతారు వాళ్ళిళ్ళల్లో. చొల్లు వెధవలు. తినీ తెగ గునుస్తారు'అంటూ అవతారానికడ్డం వద్దాడు కైలాసం.

'నీ గొడవేమిటి నాయనా ?' చిరునవ్వుతూ ప్రశ్నించా డవతారం.

'అసలు ఊరగాయలనేవిఎందుకు పెడతార్రా ?' నిల్దీసి అడిగాడు కైలాసం.

'ఎందుకేమిటి నీ పిండాకూడు! తింటానికి' తేలిగ్గా తేల్చేశా డవతారం.

'ఛఛ నోర్ముయ్!' అంటూ ఒంటికాలిమీద లేచాడు కైలాసం.

'ఏమి మిత్రా ?' తెల్లబోయా డవతారం.

'ఏమీలేదు. ఇహ నిన్ను నేను ప్రశ్నలడగను. నువ్వు నాకు సమాధానం చెప్పొద్దు. అన్నీ నేనే చెప్తా! చక్కగా నువ్వు చచ్చినట్టు విను.'

కళ్ళు మూసుకుని, తలవేళ్ళాడేసి ఫొటో దిగబోయే శవంలాగా గోడకి జార్లబడి పోయా డవతారం. కైలాసం గొంతెత్తాడు.

'అసలు ఊరగాయలనేవి ఒకసారి మనం వాటి నేర్పాటుచేస్తే కనీసం ఒక సంవత్సరంపాటు రూప, లావణ్య, తేజ, సౌరభ, రుచ్యాదుల నాట్టే కోల్పోకుండా మనల్ని సంతోషపెట్టాలి. అది ధర్మం! అదే న్యాయం! అదే ఆంధ్ర జాతీయ సత్యం! వీటినన్నిటినీ ధిక్కరిస్తాయి మా శ్రీమతి పెట్టే ఊరగాయలు. మర్నాటినించే నల్లబడిపోతాయి.



మూడో నాటినుంచే బూడిదరంగు వెల్వెట్ లాంటి బూజు ఉదయిస్తుంది. "రుచి" అనేది వూరితేనేగాని రాదు గదా! అసలు వూరడానికే ఛాన్సు లేనప్పుడు రుచి విషయం మాట్లాడ్డం మనకు సాధ్యమా? కాదు. ఇహ వాసనంటారా? మృతమూషిక పరిమళం.... అక్కడికి ఓ జనాదరణ పొందిన పత్రికలో అవిడెవరో ఉపదేశించిన పద్ధతుల్లోనే పాళ్ళన్నీ పోస్తుందట! అనుభవజ్ఞురాలయిన గంగా భాగీరథీ సమానురాళ్ళ పలహాలూ పుచ్చుకుంటుందట.

నూటయాభై సంవత్సరాల వయసున్న స్కాచ్ విస్కీ పోసినా ఆ ఊరగాయల ఖర్మం తేనని నా దృఢ విశ్వాసం. సరే... అసలు విషయానికొస్తా!

వాళ్ళిద్దరూ వాళ్ళవాళ్ళ భార్యల వంటకాల విషయంలో కొన్ని ప్రతిజ్ఞలు చేశారు గాబట్టి అంతకన్నా కఠినమైన ప్రతిజ్ఞ నేనూ చేస్తాను.

శవాల్ని నిలవజేసే రసాయనిక ద్రవాల్లోనైనా సరే, మా యావిడ పెట్టిన ఊరగాయని ఒక్క వారం రోజులు నిలవ చేయగలిగితే మా అత్త

గారినీ, బావమరిదినీ ట్రంక్ కాల్ చేసి పిలిపించి, ఏడు సంవత్సరాల పాటు నా నెత్తి నెక్కించుకొని పిండి కొట్టించుకుంటా. ఏమంటావ్ మరి?' అంటూ అవతారం భుజాలు పట్టుకు వూపాడు కైలాసం.

'స్టాప్' అని గావుకేక వేసి పోలీస్ వాడి భంగిమలో కుడి చెయ్యి చూపించి చిరునవ్వు చిందిస్తూ మెల్ల మెల్లగా కళ్ళు తెరిచాడవతారం.

ఒటుక్కున ఆచేతి నలాగే పట్టేసు కున్నాడాచారి.

హస్తసాముద్రికం తెలిసిన వాడిలా చేతిలో రేఖల్ని పరీక్షిస్తూ 'అయ్యబాబోయ్' అని గుండె బాదు కుని, 'హోర్నీ అదృష్టం మండి పోనూ! సుఖభోజనరేఖ నీ చేతిలో ఎలావుందో చూడు... ఒరేయ్! ఒరేయ్! చూడండ్రా ఈ రేఖ' అంటూ వాళ్ళందరికీ ఓ పొడుగాటి ఖండ రేఖ చూపించాడు.

కైలాసం, సర్వయ్యకూడా ఆ చేతి నలాగే పట్టేసుకుని, ఆ రేఖని పరీ క్షించే నెపంతో వెనక్కి విరిచెయ్య డం మొదలెట్టారు.

'వేళ్ళు విరిగిపోతున్నాయి వద లండ్రా' అని మొత్తుకుంటున్న అవ తారం మాటలు వాళ్ళకి వినబడ్డం లేదు. అక్కడికీ ఎడంచేత్తో తలా ఒక మొట్టికాయా వేశాడు. అవీ వాళ్ళకి తగిలినట్టులేదు. బాధెక్కువైన అవ తారం దిక్కులేక 'ఒరేయ్! ఆ సుఖ భోజనప్రాప్తి మీకూ కలిగిస్తారా! దయచేసి నా చెయ్యి నాకు తిరిగి యిచ్చెయ్యండి' అని ఏడుస్తూ నేల మీదబడి గిలగిలాతన్నుకోసాగాడు.

ఈ మాటలు వాళ్ళచెవిని బడ్డ ట్టున్నాయి. 'ఆఁ! నిజమా?' అని ఆత్రంగా బృందగానం చేశారు ముగ్గురూ.

'నిజంరా రాక్షసి వెధవల్లారా' అంటూ మూల్గాడవతారం.

కైలాసం గభాల్న తన చేతి వేలి నున్న వెంకటేశ్వరస్వామి ఉంగరం అవతారం నెత్తినపెట్టి 'నిజంగా?' అన్నాడు.

'బాబోయ్! నిజంరా' అన్నా డవతారం.

'ఎప్పుడూ?' అన్నాడు సర్వయ్య చెయ్యి మరింత వడేసి పట్టుకుంటూ.

'ఎప్పుడేమిట్రా? రేపొచ్చే ఆది వారంనాడే' అంటూ చెయ్యి విది లించుకోబోయాడవతారం

'రేపొచ్చే ఒక్క ఆదివారమే ఏమిటోయ్? ఒక సంవత్సరం పాటొచ్చే ఆదివారాలూ, రెండో శనివారాలూ, పండగలూ, సెల వలూ, సంగతేమిటని? అవన్నీ వృధా పోవలసిందేనా ఎందుకూ పనికి

రాకుండా?' అంటూ చేతిని కొద్దిగా వెనక్కి విరిచాడు సర్వయ్య.

చెయ్యి విరగడంతో బాటు ఓ పిడుగు కూడా నెత్తిన పడ్డట్టయిం దవతారానికి.

'పొద్దున్నే గడ్డం గీసుకుని చూసుకుంటానా, పదేళ్ళు చిన్నవాణ్ణి అయినట్టుంటుంది.'

'మరైతే సాయంత్రం గీసుకోరాదుటండీ, ఎంచక్కాను!'

'ఇదెక్కడి ఖర్మంరా! ఒక్క ఆదివారమయితే ఫర్వాలేదు. నాలుగైనా ఇబ్బందిలేదు. ఇన్ని రోజులు మిత్రసంతర్పణలు నే నెక్కడ చేయగల్రా? నె నార్థి లోయర్ డివిజన్ గుమాస్తాగాణ్నేగా' అంటూ ఏడ్వబోయాడు.

అయితే మాత్ర మేం మాయ రోగం నీకు? సుబ్బరంగా మీ వూర్నించి బస్తా చెల్లగా బస్తా బియ్యం దొర్లించుకొచ్చే ఏర్పాటుందిగా నీకు? పైగా నీకేం పిల్లా? పీనా?' అన్నాడాచారి.

'మరే! ఇంతాజేసి మే మడిగింది ఒక్కటంటే ఒక్క సంవత్సరంలో వచ్చే సెలవురోజులు. అపైన నువ్వు బొట్టూకాటుకా పెట్టి పిల్చినాకూడా మేం రాము' అన్నాడు కైలాసం.

'అదీగ్గాకుండా.... మనందరికీ గాని, మనలో కొందరికిగాని ట్రాన్స్ఫరులూ, ప్రొమోషనులూ రాకముందే ఇట్టాంటి వేడుకలు జరుపుకుంటే బావుంటుందని మా ఉద్దేశం' అన్నాడాచారి.

'ఒరే వెర్రిపీనుగా! నీ భార్య ఇంత అద్భుతంగా సకలాంధ్ర జనామోదకరంగా వండుతుందనిగానీ,... లేకపోతే నిన్నే పట్టుకొని బ్రతిమాలడానికి మేమేం శుంఠలంగాదు.పిచ్చి వెధవా! ముద్దుగా ఒప్పేసుకో! వచ్చేపేరు పాడుజేసుకోకు' అన్నాడు సర్వయ్య బుద్ధిచెప్పేవాడిలా మాట్లాడుతూ.

ఇదేభావాన్ని మిగతా ఇద్దరూ చెరి ఒకరకంగానూ వెలిబుచ్చారు.

అవతారానికి మహదానందంతో బాటు కాస్త గర్వంకూడా తలెత్తింది.

'అలాగేరా బాబూ! నా చెయ్యి వదిలెయ్యండి' అన్నాడు.

చెయ్యి వెంటనే విడుదల పొందింది.

'స్! అబ్బబ్బబ్బ' అనుకుంటూ తనచేతివేళ్ళని వూదుకుని నాల్గుసార్లు అల్లల్లాడించా డవతారం.

'అవతారం దంపతులకి జైయ్' అంటూ ఎగిరాడు కైలాసం.

ఇదేదో బాగుందనే అభిప్రా

యంతో మిగతా ఇద్దరూ కలిసి ఇదే వాక్యాన్ని మరో రెండుసార్లు ఎలుగెత్తి కూశారు.

'ఒరేఅబ్బాయిలూ! మీరుచెప్పిన దానికి నే నొప్పుకున్నాను. కాస్త నా మనవిని కూడా ఆలకించమని మిమ్మల్నందర్నీ ప్రార్ధించా లనుకుంటున్నాను' అన్నాడవతారం దీనంగా.

'ఆలకిస్తాం ప్రార్థించు' అన్నాడు పర్వయ్య.

అవతారం చేతులు జోడించాడు. 'మిత్రులారా! మిమ్మల్ని ముగ్గుర్నీ కలిసి ప్రతి సెలవు రోజునా మేపాలంటే ముఖ్యంగా మా యావిడకి కష్టమవుతుంది. వంటలు మీరాశించినంత రుచిగా వుండకపోవచ్చు. కాబట్టి ఈ మిత్ర సంతర్పణలు ప్రతి ఒక్కటీ విజయవంతం కావాలంటే ఒక్కొక్క సెలవురోజున ఒక్కొక్క ఇంటికి వెళ్ళి మేసిపోతే బావుంటుంది. కావాలంటే ఆ మేరకు ఎగ్రిమెంట్లు కూడా రాసుకుందాం. నాకే మభ్యం

---


# ఉదరాంతకి

చంటి పిల్లల సమస్త అనాసలు, లివర్ అండ్ స్ప్లీన్సు వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును.

# అమృత సంజీవినీమాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధులను పోగొట్టి తల్లికి, గర్భస్థ శిశువునకు బలము కలిగించి సుఖప్రసవము, సత్సాంతానము కలుగజేయును.

## శ్రీ భుజంగరావైద్యశాల

ప్రొప్రయిటర్సు 'భిషక్ శిరోమణి' పొన్నాడ పేరయ్య అండ్ సన్సు

తాళ్ళరేవు, తూర్పుగోదావరిజిల్లా.

తరం లేదు ...' అంటూ వేదుకున్నాడు.

ఈ పద్ధతి బాగుం దనిపించింది కైలాసానికి. 'ఓ యస్! అలాగే' అనేశాడు.

ఆచారీ, సర్వయ్య కైలాసంవేపు ఉరిమి చూసి, అతి బలవంతాన 'సరేరా!' అంటూ ఒప్పేసుకున్నారు.

'అయితే రేపొచ్చే ఆదివారం నాడు ఎవరొస్తారో తేల్చి చెప్పండి సాయంత్రంలోగా' అంటూ అవతారం క్యారియరు సర్దుకుని వెళ్ళిపోయాడు పరుగెత్తుకుని.

ముగ్గురూ 'నే మ ముందంటే నేను ముందు' అనుకున్నారు. చిక్కు విడలేదు.

'చిల్లపెంకుమీద ఉమ్మేసి ఎండా వానా ఎగరేసి తేల్చుకుందాం' అన్నాడు కైలాసం.

'ఓర్నీ తెలివి తగలెయ్య! ఉన్నది ముగ్గురం కదరా?' అంటూ ఖాళీ డబ్బా కిందపడినప్పుడు చేసే చప్పుడులాగా నవ్వేసి 'అదేం లాభం లేదు. చీటీలమీద మన పేర్లు రాసి లాటరీ తీద్దాం' అన్నాడు సర్వయ్య.

'ఛ ఛ! వెధవ లాటరీ లేమిట్రా ఆడదానిలాగా! శక్తి సామర్ధ్యాల ప్రకారం తేల్చుకుందాం' అన్నాడాచారి తొడ చరుస్తూ.

'సైరా ఆచారీ' అంటూ రెండు తొడలు చరిచాడు సర్వయ్య.

ఒక్క కైలాసానికి ఒళ్ళు జలదరించింది. 'అంతే కుస్తీలు పట్టి తేల్చుకుందామనావేరా?... నావల్ల కాదు బాబూ! నాకు వంట్లో బలహీనంగా ఉండిగూడాను' అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు.

ఆచారి మద్దెల మోతలాగా నవ్వేసి 'కుస్తీ గాదోయ్ చవటలూ! ఇడ్డెను పందెం వేదాం. ఎవడెక్కువ మెక్కితే వాడికి మొదటాదివారం దక్కుతుంది. కాస్త తక్కువ తిన్న వాడికి రెండో ఆదివారం; ఇంకాస్త తక్కువ తిన్నవాడికి మూడోదీనూ' అన్నాడు ఉత్సాహంగా.

'అయితే రేపు ఆచారిగాడింట్లో ఇడ్డెన్ల నోము పడ్తారన్నమాట' అన్నాడు కైలాసం పక్కనున్న గోడతో చెమ్మచెక్క లాడుతూ.

'అబ్బే! మా ఆడంగులు మూడ్రోజులపాటు ఇంట్లోకి రావడానికి వీల్లేదు. ఆపైని పుట్టింటి క్కూడా వెళ్ళాలని మహా ఇదై పోతోంది. సర్వయ్య ఇంట్లో ఏర్పాటు చేసేద్దాం' అన్నాడాచారి జాగ్రత్తగా తప్పుకుంటూ.

సర్వయ్య దీనికేం బెదిరిపోలేదు. 'అదేమంత గొప్ప పనిగానీ — మా యావిడ వండివ ఇడ్డెన్లు నేను

తినననీ, నా కళ్ళెదటగాగాని, చాటుగాగాని, నా మనస్సుకు తెలిసి మరొకళ్ళని – ముఖ్యంగా మిత్రుల్ని తిననివ్వననీ, అలా చేస్తే చచ్చినంత ఒట్టనీ ఘోర శపథం చేశాను' అన్నాడు నడినెత్తి గోక్కుంటూ.

'అయితే కైలాసానికి తప్పదు మరి' అన్నా డాచారి కైలాసం వంక చూస్తూ.

'అయ్యా! నాకో ఇబ్బందుంది. అదేం ఖర్మమో. మా యావిడ ఇడ్డెన్లంటూ వండితే ఆ రోజు ఏ బంధువుకో మిత్రుడికో నూరేళ్ళూ నిండిపోతాయి. కాపురాని కొచ్చిన కొత్తలో వండితే అదే రోజున మా మేనమామ పోయాడు. మరో సారి వండితే పాపం నా అప్త మిత్రుడు సోమసుందర కనక బుచ్చిరాజు స్వర్గస్థు డయ్యాడు. నాల్గు నెలలనాడు వండితే ఆ రోజు మా యావిడ పినతల్లికి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి. అప్పటించి మా ఇంట్లో ఇడ్డెన్లు వండడం అచ్చిరాదని నిర్ణయం చేసుకున్నాము. అందువల్ల కుదరదు' అంటూ కుండ పగల గొట్టినట్టు చెప్పేశాడు కైలాసం.

'ఇదేం లాభంలేదు గానీ, హాయిగా మూడు గంటలకి కాంటీనుకి వెళ్ళి తీర్చేసుకుందాం' అన్నా డాచారి.

మూడు గంటలకి ముగ్గురూ క్యాంటీను కెళ్ళారు.

కైలాసం 37 ఇడ్డెన్లు ... అనగా మొదటి ఆదివారం.

ఆచారి 33 ఇడ్డెన్లు ... అనగా రెండో ఆదివారం.

సర్వయ్య 28 ఇడ్డెన్లతో మూడో ఆదివారం గెల్చుకున్నారు.

అయితే ఈ ఖర్చులు ఎవరి ఖాతాలో రాయాలి అనే ప్రశ్న వచ్చింది. వెధవది 'నీ ఖాతాలోనే' అంటే 'నీ ఖాతాలోనే' అని దెబ్బలాడుకుంటే అసహ్యంగా వుంటుందనీ, చూసిన వాళ్ళెవరూ ఇక కింద వుమ్మెయ్యరనీ తలచి అవతారం ఎక్కవుంట్లో గుచ్చెత్తి రాసేశారు. ఈ అల్ప విషయం అతనితో చెప్పడం చాలా సిల్లీగా ఉంటుందని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డంవల్ల అంతా నోర్మూసుకునే ఉండిపోయారు.

కానీ—

'మిత్ర సంతర్పణల కార్యక్రమము' అనే శీర్షికతో ఓ కాగితం మీద ఏ ఆదివారంనాడు ఎవరు రాబోతున్నదీ రాసిచ్చేశారు సంతకాలూ తేదీలతోసహా.

మొదటి ఆదివారం రానే వచ్చింది. కైలాసం ఉదయం తొమ్మిది గంటలకే ముస్తాబై అవతారం ఇంటికి బయల్దేరాడు. అతని భార్య చాముండేశ్వరి కూడా అత

నితో ప్రయాణం కావాలని ముచ్చట పడింది. 'ఛ ఛ! వద్దు' అన్నాడు కైలాసం.

'అలా అయితే పోనీ ఓ నెల్లాళ్ళ పాటు పుట్టింటికి వెళ్తాను' అంటూ మరీ మరీ ముచ్చట పడింది చాముండేశ్వరి.

అందువల్ల అవిణ్ణి కూడా భోజనానికి తీసికెళ్ళాలని సరదా పడ్డాడు కైలాసం. పడ్డమేమిటి? సరదా తీర్చుకున్నాడు కూడాను.

అవతారం పెళ్ళాం సుందరమ్మ తన పాకశాస్త్ర ప్రావీణ్యంతో దివ్యమైన సంతర్పణ చేసింది. కైలాసం, చాముండేశ్వరి విపరీతంగా ముగ్ధులైపోయి అరగిస్తూన్నప్పుడూ, గించిన తర్వాతా కూడా చెడ పొగిడేశారు అవతారం దంపతుల్ని.

వాళ్ళిద్దరూ మహదానందంతో బాధపడిపోయి సాయంత్రం కాఫీ టిఫిన్లూ, రాత్రికి 'మంచి మాటా' కూడా ఏర్పాటుచేసి పంపించారు.

మర్నాడాఫీసులో కైలాసంబకతే రొద! – తాను వెళ్ళిన సంతర్పణ గురించి ప్రతి అడ్డమైన వాడితోనూ చెప్పేశాడు వివరాలతో సహా.

ద్వితీయ స్థానం గెల్చుకున్న అచారికిది విన్నదగ్గర్నుంచీగుర్రెక్కువైంది. ఎందుకూ? ఒక్కడే వెళ్ళకుండా భార్యాని కూడా మోసికెళినందుకు. గబగబా సర్వయ్య దగ్గరకు పరుగెత్తికెళ్ళి "చూశావురా ఈ అరాచకం?" అన్నాడు ఉక్రోషంగా.

'వాడో త్రి లేకి వెధవలేరా! దరిద్రుడు! మంచీ మర్యాదాకూడా లేదు' అంటూ తిట్టేశాడు అచారి కన్నా బాధ పడిపోతూ.

"వీడి రోగం నేను కుదురుస్తాగా" అంటూ వెళ్ళిపోయా డాచారి.

రెండో ఆదివారంనాడు అచారి తన భార్య గోపాలరత్నాన్నీ, ఇద్దరు పిల్లల్నీ కూడా ఉదయం ఎనిమిది గంటలకే రిక్షా మీదేసుకుపోయి, కైలాసం మీది కసి తీర్చుకున్నాడు.

ఇది తెలుసుకున్న సర్వయ్య, మూడో ఆదివారంనాడు తన పెళ్ళాం బిడ్డలతోనూ, చుట్టం చూపుగా వచ్చిన పిన్నత్తగారితోనూ కలిసి చీకటితోనే వెళ్ళిపోయి, అచారి, కైలాసాలమీద వున్న తన కోపం అంతా తీర్చుకున్నాడు.

ప్రతి సంతర్పణ రోజునా నడవడం కష్టంగా ఉందని, రెణ్ణెల్లు జరిగేసరికి అచారి తన నివాసాన్ని అవతారం ఉండే వీధిలోకి మార్చుకున్నాడు.

రిక్షా ఖర్చులు కలిసొస్తాయి గదా అని కైలాసం తన బసని అవతారం ఇంటి ఎదురుగా వుండే ఇంట్లోకి మార్పిడీ చేశాడు – మరో ఇరవై రోజుల్లో.

ఇంకో పదిహేను రోజులు తిరక్కుండానే సర్వయ్య అవతారాన్నే తన ఇంటి పక్కింటికి కాపురం మార్పించాడు. ఎందుకుటా?

అవతారం ఇప్పుడుండే ఇల్లు సౌకర్యంగా లేదట! (ఎవరికో?!) తను చూపించిన ఇల్లయితే సర్వ సౌకర్యాలూ ఉన్నాయిట. బాడుగలోకూడా పెద్ద వ్యత్యాసం లేదుట. ఒకే ఒక్క పది రూపాయలు మాత్రం ఎక్కువట! అంతే! అంతకన్నా ఏం లేదట!

ఈ ఇల్లొక ప్రైవేటు మాస్టరుగారిది. ఒక పక్క ఆయన తన భార్యా బిడ్డలతో ఉంటూ, వీధి వరండాలో పదిమంది పిల్లలకి ప్రైవేట్లు చెప్పుకుంటూ మరో పక్క అద్దె కిచ్చేశారన్నమాట.




అవతారం దంపతులకి నిజంగా ఆ ఇల్లు నచ్చింది. రెండు గదులు, ఒక వంట గది, బావి, మంచినీటి కుళాయి ఉన్నాయి. విశాలమైన పెరడు.

మాస్టారికీ, ఆయన పెళ్ళాం అది లక్ష్మమ్మగారికీ అవతారం దంపతులంటే చాలా ప్రేమ ఏర్పడింది. వాళ్ళా యింటి కొచ్చిన వారం లోపలే! పిల్లలూ అంతే! వీళ్ళంతా అన్ని పనుల్లోనూ సాయపడ్తూండేవారు సుందరమ్మకి.

మిత్ర సంతర్పణలు జరిగే రోజుల్లో వాళ్ళ సహాయం మరీ ఉండేది. అందువల్ల అవి మరీ దివ్యంగా జరగడం మొదలెట్టాయి.

అయితే వీళ్ళూ వాళ్ళకి సాయపడ్తూనే ఉండేవారు, ఒకటీ రెండూ అప్పు రూపంలో. నాలుగు నెలలు జరిగే సరికి అవతారానికి సంతర్పణలు చెయ్యడం కొంచెం భారంగానే తోచింది. ఒక్క బియ్యం మినహాయిస్తే మిగతావి ఏవి మాత్రం తేరగా వస్తాయి? తన పెళ్ళికి మామగారిచ్చిన బహుమతి పైకంలో మిగిలిన అయిదొందల రూపాయలూ తీసికెళ్ళి బ్యాంకు

భార్య :- మేడమీదికి రెండు గ్లాసుల్తో ఎందుకూ, కాఫీ పట్టు కెళ్ళడం, అక్కడెవరో అతిథు లున్నట్టు ?

భర్త :- అదా! నీ చేత్తో చేసిన కాఫీ ఒక గ్లాసు తాగ్గానే, నన్ను వివశుణ్ణి చేసేసి వేరే మనిషిగా మూర్చేస్తుంది... అప్పుడు మరి అతనికి రెండో గ్లాసు అవసరం కదా!

---

వాళ్ళ కిచ్చి దాచిపెట్టమంటే వాళ్ళిప్పుడు వంద రూపాయలే వున్నాయని దబాయిస్తున్నారు. ఈ వందా ఇంకెన్నాళ్ళొస్తాయి? వాళ్ళందరినీ ఒక్క సంవత్సరంలో వచ్చే సెలవులన్నిటిలోనూ మేపుతానని వెంకటేశ్వరస్వామిని నెత్తి నెట్టుకుని ప్రమాణం చేశాడాయె! (అదే!... వాళ్ళే చేయించారు!) పోనీ ... తనకు ఆఫీసులో లంచం రూపంలో వచ్చే ఆదాయమూ లేదు. తన ప్రమాణానికి భంగ మొస్తుందేమోనని భయమేసింది. ఏదన్నా మార్గం కనబడుతుందేమోనని అతి నిశ్శబ్ద ప్రదేశాలలో ఏకాంతంగా ఆలోచించాడు. లాభం లేకపోయింది. ఆఖరికి మొండికేసి 'ఆ స్వామిదే భారం' అంటూ తన భారమంతా 'పై వాడి' మీద తోసేసి, తను కేవలం నిమిత్త మాత్రుడైపోయాడు.

మరో రెండు సంతర్పణల తర్వాత ఆదిలక్ష్మమ్మగారు తన తమ్ముడి బారసాల కోసమని పిల్లలతోసహా పుట్టింటి కెళ్ళింది. మాష్టారు మాత్రం ఇక్కడే ఉండిపోయారు. తనను నమ్ముకున్న విద్యార్థుల్ని గంగలో ముంచడాని కిష్టంలేక! (అదీగాక రెండు మూడు రోజుల్లో వాళ్ళంతా జీతాలు తెచ్చిస్తారు కూడాను.)

ఆవిడ వెళ్ళిన మర్నాడు మాష్టారు స్వహస్తపాకం చేస్కోడాని కుపక్రమించారు. వంటింట్లో గిన్నెలూ, గరిటలూ ఎగిరెగిరి పడ్తున్నాయి. ఇదంతా గమనించిన సుందరమ్మకు నవ్వుతోబాటు జాలి కూడా కలిగింది. పాపం వాళ్ళు ఇన్నాళ్ళుగా తమ కింత సాయం చేసినందుకు ఆయనకి రెండు పూటలు అన్న ప్రాశన చేస్తే తప్పేమిటీ ? అని. గబగబా అవతారం ద్వారా మాష్టారికి కబురు చేయించింది. 'పెద్దమ్మగారెలాగూ నాల్రోజుల్లో తిరిగొస్తారు గదా! అందాకా మాతోబాటే మా యింట్లోనే ఎంగిలి పడవలసిందీ' అని.

మాస్టారు కొత్త అల్లుడు కన్నా చిన్నగా మొహమాటు ప్రదర్శన చేశారు కానీ, సుందరమ్మ కూడా వచ్చి నోరు చేసుకునేసరికి 'సరే! మీ ఇష్టం' అనక తప్పలేదు.

మాస్టారు కూడా పొగడ్డంలో అందె వేసిన చెయ్యి! రెండ్రోజుల ఎంగిలికే అవతారం దంపతుల మొహాలు – జీడి గింజల పొగవేసినట్లు వాచిపోయాయి. వాళ్ళ మొహాల్ని చూస్తే జాలి గలిగింది గావన్ను మాస్టారుకి. మూడో రోజు నుంచీ ప్రోగ్రాం మార్చారు. ఫలానా కూర వండాలంటే నూనె కన్నా నేతికే అర్హత ఎక్కువనీ, ఫలానా పచ్చట్లో దబ్బకాయపులుసు పిండితే వంటికి చాలా మంచిదనీ, కాకి రంగు మనుషులైనా గులాబీ రంగు దాలుస్తారనీ, పులుసులో ముక్కలు ఎంత పెద్దవిగావుంటే అంత బాగుంటుందనీ చెప్తూ వాళ్ళ రుచులకు సలాం కొట్టించి తన రుచులకు స్వాగతం కొట్టించి పొట్టపోసుకోసాగారు. ఇది కొంచెం కష్టమనిపించింది అవతారం దంపతులకి. ఇంకెన్ని రోజుల్లే? అని సరిపెట్టుకున్నారు. వారం తిరిగింది. అది లక్ష్మమ్మగారు రాలేదు. ఉత్తరం మాత్రం వచ్చింది.

మాస్టారు రానందుకు చాలా


ప్రఖ్యాత ఔషధము

60 యేండ్లకు పైగా

జమ్మివారి లివర్ క్యూర్

(బిడ్డల యొక్క లివర్ మరియు ప్లీహ వ్యాధులకు ప్రఖ్యాత ఔషధము.)

జమ్మి వెంకటరమణయ్య & సన్స్, మద్రాస్-4.

బ్రాంచిలు:

బెంగళూరు-2; కుంభకోణం;

తిరుచిరాపల్లి-2; హైదరాబాద్-20

JV/17/STE



మంది బాధపడిన సంగతీ, ఎదురింటి వారు పంకాయల వడియాలు పెట్టుకున్న వైనం, పంచదార కరువూ, సుబ్బయ్య చౌదరిగారి పెళ్ళాం తన ఆధ్వర్యంలో అప్పడాలు చేసుకున్న విషయమూ, వగైరాలతో బాటు బారసాల మరో పదిరోజుల దూరం వెళ్ళిందనీ, అదికాస్తా వెళ్ళమార్చుకుంటేనేగాని తను రావడంపడదనీ, మాస్టార్ని జాగ్రత్తగా ఇల్లు చూసుకోమని కూడా ఆదిలక్ష్మమ్మగారు రాసింది.

ఈ వార్త అవతారం దంపతులికి ఆనందంగా అందించారు మాస్టారు.

అది విన్న సుందరమ్మ అదోలా అయిపోయింది.

అవతారం చదువుతున్న పేపర్లో అక్షరాన్నీ అలుక్కుపోయాయి.

మాస్టార్ని వెళ్ళనిచ్చి, "ఇదేం ఖర్మండీ! ఈయనింకా 15 రోజుల దాకా వచ్చేట్టు లేదు. మనమీ మిత్ర సంతర్పణలే చేయగలమా? ఈయనకు రెండు పూట్లా ఆయన రుచుల ప్రకారమే వండిపెట్టగలమా? నాకేం పాలుపోవడం లేదు" అంది సుందరమ్మ అవతారం చెవిలో నోరెళ్ళబెట్టి.

"అవునే! నాకూ ఏం పాలుపోవడంలేదు. మిత్ర సంతర్పణల కన్నా ఈయనే కష్ట మనిపిస్తున్నాడు" అన్నా డవతారం గుడ్లెళ్ళబెట్టి.

"పోనీ... ఓ పని చేస్తే?" అంది సుందరమ్మ.

"ఏమిటా ఓ పనీ?" ఆత్రంగా నిలబడ్డా డవతారం.

"ఏం లేదు! ఇవాళ నుంచీ ఆయన్ని భోజనానికి పిలవకుండా వూరుకుంటే సరి..." అని అవతారం చెవిలో చెప్తూండగానే సుడిగాలిలా వచ్చారు మాస్టారు "అమ్మాయ్! సుందరమ్మా" అంటూ.

గభాల్ని మొగుడికి దూరంగా జరిగి, ముఖంలో ఆనంద రేఖలు గీస్తూ "ఏమిటి బాబాయిగారూ" అంది సుందరమ్మ.

"ఏం లేదమ్మా! ఈ పూట ఓ మిత్రుడి కేసులో సాక్ష్యం చెప్పడానికి మేజిస్ట్రేటు కోర్టు కెళ్ళాలి. త్వరగా వంట గానిస్తే ఓ మెతుకొ్కరికి వెళ్ళొస్తా" అన్నారు లాలనగా.

"అలాగే బాబాయిగారూ!" అంది సుందరమ్మ బలవంతంగా.

మాస్టారు వెళ్ళిపోయారు.

అవతారం ముఖం చిట్లించి సుందరమ్మవంక చూశాడు "ఇదేంఖర్మ?" అన్నట్టు. సుందరమ్మ తన నుదుటి మీద అడ్డంగా కుడిచేతి బొటనవ్రేలు గీసి ఒక్క నిట్టూర్పు విడిచి వంటింట్లోకి వెళ్ళింది.

రెండ్రోజుల పాటు ఏవేవో పనులుండటంవల్ల మాస్టారే తొందరి

వడిపోవడం మొదలెట్టారు భోజ నాలకి.

మూడోరోజు చీకటితోనే జ్వరం, వాంతులు తెప్పించేసుకుంది సుంద రమ్మ.

పీధరుగుమీద దంతధావన చేసు కుంటున్న మాస్టారికీవిషయం మనవి చేస్తే ఆయన అర్థంచేసుకుంటారని ధైర్యంచెప్పి పంపిం దవతారానికి.

అవతారం వెళ్ళి 'మాస్టారూ! ఈపూట మాయావిడికి కాక తగిలిం దండీ...' అన్నాడోలేదో 'దాని కింత భయమెందుకుబాబూ! నువ్వేం బెంగపడకు! నే వస్తున్నా పద' అంటూ అతన్ని లోపలికి తరిమేసి గబగబా పని పూర్తికానిచ్చి ఇంట్లో కెళ్ళి ఏదో మందుకుప్పె తేనెతో అరగదీసి బాదమాకులో పెట్టుకుని హడావిడిగా సుందరమ్మ దగ్గరకు పరుగెత్తి బలవంతాన నాకించి 'ఇంకేం ఫర్వాలేదమ్మా! హాయిగా విశ్రాంతి తీస్కో' అంటూ ధైర్యం చెప్పి పడుకోబెట్టి 'ఇలా రావయ్యా అవతారం' అంటూ అతన్ని వంటిం ట్లోకి కేకేసుకెళ్ళి 'చూడు! కుంపటి రాజేసి రెండుసోలల బియ్యం అత్తేస రెట్టు... నేనీలోగా బెండకాయలు తరుగుతా! కత్తిపీటా, కూరలూ ఇలా పడెయ్' అంటూ గోడకాను క్కూర్చున్నారు.

బిక్కమొగమేసి చూడసాగా దవతారం.

'అట్లా చూస్తావేమయ్యా! మని షికి, పూటకి సోలెడు బియ్యంచాలు. అమ్మాయినివాళ కటిక లంఖణం పెట్టాల్సిందేగదా! అందువల్ల మని ద్దరికీ రెండుసోలలన్నమాట' అంటూ పాఠాలు చెప్పే పద్ధతిలో బోధించి 'ఇదరికి ?' అని ప్రశ్నలాగా అడిగి మిగతాది పూర్తిచెయ్యమనే భావంతో అతనివంక చూశారు.


'అలా చూస్తావేమయ్యా మొద్దు లాగా! చెప్పు!... ఇద్దరికీ ?...'

'రెండుసోలలు' అన్నాడవతారం; చచ్చీచెడీ తెలుసుకున్న విద్యార్థిలా.

'ఆఁ!... అయిందా ? ... ఇవీ బెండకాయలు. వాటిని పులుసుబెట్టి కూరవండుకొమన్నమాట... పులుసు బెట్టీ ? ...' అంటూ అవతారంవైపు చూశారు మాస్టారు.

'కూర వండుకొమన్న మాట' అంటూ పూర్తిచేశా డవతారం.

'ఆఁ... గూడ్!... అయిందా?... మరి .. పుల్లటి కూరొండుతున్నాం గాబట్టి మరో ముఖ్యమైన పదార్థం వండాలి, ఏమిటదీ? ...'




ఏమిటో తెలియక దిక్కులు చూడసాగాడవతారం.

మాస్టారికి క్రోధం వచ్చింది గావన్ను! గభాల్న ఎగిరి "ముద్దపప్పయ్యా! ఎన్నిసారు చెప్పాలీకు?" అంటూ చెయ్యెత్తారు గూబ్బగలగొట్టేందుకు.

"ఆలాగేసార్! ముద్దపప్పే" అంటూ తన తప్పొప్పుకున్నా డవతారం వణికిపోతూ.

"ఆఁ!... ఇంకా దేవుడు మేల్జేస్తే మనం ఆంధులం. మనం?..."

"ఆంధ్రులం"

"ఆఁ! చూశావా! దోవలో పడ్డావ్! ఆఁ... మనం ఆంధ్రులం. మనకూ ... ముఖ్యంగా ..." అని మాస్టారు సాగదీస్తుండగానే, దోవలో పడిపోయిన అవతారః ఉక్రోషంతో, గుడ్లవెంట నీరు తిరిగినవాడై, బొంగురుగొంతు ఏర్పడినవాడై "ఓ పచ్చడి వుండాలి; గొంతుక దిగడానికి వీలుగా చారు, పులుసు, మెంతిమజ్జిగ లేక మజ్జిగపులుసులాటి ఓ ద్రవపదార్థం చాలా అవసరం. ఉంటే అప్పడాలూ, వడియాలూ, వూరమిరపకాయలూ కూడా ఆంధ్ర భోజనానికి మరింత సౌభాగ్యాన్ని కలిగిస్తాయి" అన్నాడు ఒక్క గుక్కలో.

మాస్టారు ఈధాటికి అదిరిపోయి పెంకులెగిరిపోయేలాఘొల్లున్న వ్వేసి "హెూర్నీ హసాధ్యంకూల... మొత్తా

నికి చిచింద్రీలాటి వాడివయ్యా! మొదలంటిస్తే చివరకూ అంటుకు పోతావు! భేష్! అల్లావుండాలి! ఇంకేం? కానిచ్చెయ్ మరిత్వరగా! నే హాయిగా చూస్తూ కూర్చుంటాను' అంటూ బహు సంతోషంగా ఓ పేద్దపీట వాల్చుకుని బాసిపెట్లేసు క్కూర్చున్నారు.

సుందరమ్మ తన తెలివితక్కువ ప్లానుకు మంచంలోనూ, ముసుగు లోనూ మగ్గిపోవడం మొదలెట్టింది. తనకు బలవంతాన మూడుపూటలా మందులు నాకి, కషాయాలు సేవించాల్సిరావడంతో బాటు కటిక లంఖణం కూడా ప్రాపించింది. అవతారమే ఆ రెండుపూట్లా వచ్చి వట్టు సెలవుపెట్టి మరీ వంటచెయ్య వలసి వచ్చింది. అందువల్ల మళ్ళీ తెల్లారేసరికి తనజ్వరం తగ్గినట్టు ప్రకటించి వంటలో జొరబడింది.

మాస్టారు శ్రద్ధగా సుందరమ్మ దగ్గర కూచుని, తనకూ అవతారానికీ ఇష్టమైన పదార్థాలు చేయించుకుని, సుందరమ్మకు మాత్రం విడిగా కారప్పొడీ, చారూ చేయించి పథ్యం తినిపించారు.

ఆ సాయంత్రానాడు మరో మిత్ర సంతర్పణ జరిగింది.

ఆ రాత్రి మిత్రులు వెళ్ళాక సుంద రమ్మ వేసిన ప్లాను ప్రకారం:

"ఏమండీ! అలారం ఎన్నిగంటలకు పెట్టమంటారు?" అంటూ వచ్చింది సుందరమ్మ... మాస్టారుతో మాట్లాడుతున్న అవతారం దగ్గరకు.

"నాలుగు గంటలకే పెట్టెయ్యవోయ్!" అన్నాడవతారం చిరునవ్వుతో.

"అలారమేమిటి? నాలుగ్గంటలేమిటి?" అంటూ లేచి నిలబడ్డారు మాస్టారు.

"ఆఁ! రేపొద్దున మార్యారావుపేటలో మా మిత్రుడి వివాహమండీ! ఆరింటికే ముహూర్తం. అందుకనీ..." అన్నాడవతారం వెకిలిగా నవ్వుతూ!

"ఓహో! శుభమ్! రేపు మీ కాఫీ, టిఫిన్లూ, భోజనాలూ అక్కడేనన్నమాట" అనడిగారు మాస్టారు ఆత్రంగా.

"ఆహా! లక్షణంగానూ! రెండ్రోజులపాటక్కడే వుండి అక్కడే తినాలిట! లేకపోతే నా మిత్రుడు నా రక్తం కళ్ళజూస్తానన్నాడు" అన్నాడవతారం సంతోషంగా బొంకుతూ.

'సరిసరి!' అనేసి, 'అమ్మాయ్! సుందరమ్మా... అలా అయితే మూడు గంటలకే అలారం పెట్టేసి, నా మట్టుకు రెండుసోలల బియ్యం పొంగించి, ఓ రాచ్చిప్పడు కంది పచ్చడి చేసి, కాసిన్ని చారునీళ్ళు పడేస్తివా అంతే రేపటికి వెళ్ళమారిపోతుంది. ఇహ యెల్లుండి సంగ

తంటావా! .. నేఁడో రాజా భవిష్యతి' అన్నారు మాస్టారు.

గుండెలు గతుక్కుమన్నాయి అవతారానికి, సుందరమ్మకి!

'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?' అంటూ ప్రశ్నించారు మేస్టారు.

'ఏంలేదు బాబాయిగారూ! అలాగే!' అనేసి, వెనక్కి తిరిగి లోపలికి పోయింది సుందరమ్మ మాస్టార్ని నాలుగూ తిట్టుకునేందుకు.

అలారంకన్నా ముఁదుగా మాస్టారే మేల్కొల్పారు సుందరమ్మని.

మాస్టారి పని పూర్తిజేసి ఇద్దరూ బయటపడ్డారు సూర్యోదయాత్పూర్వమే!

మిత్రుడూ; పెళ్ళీ — రెండూ అబద్ధమే కాబట్టి కాఫీ,టిఫిన్లకూ, భోజనానికీ హొటల్ మీద ఆధారపడి, నివాసానికి ఓపార్కులో చెట్టునీడని నమ్ముకుని, రాత్రి పదిగఁటలకి దేవుడా అప్పన్నా అంటూ ఇంటికి చేరి—

'ఇదేమిటయ్యా! అప్పుడే వచ్చేశారు? రేపుకూడా వుంటామన్నారుగా?' అని అడిగిన మాస్టారికి 'ఆఁ! వాడేదో మర్యాదకోసం ఉండమంటేమాత్రం... సిగ్గులేకుండా ఎలా వుండమంటారండీ?' అంటూ అవతారం కసిగా సమాధానం ఇస్తూండగానే, మాస్టారు గభాల్న తన ఇంట్లో ఏదో చప్పుడు విన్నవాడిలా అభినయించి, 'ఇశ్శో! నీ ఎలుకలు నాశనమైపోనూ' అంటూ లోపలికి పరుగెత్తారు.

మాస్టార్ని వదుల్చుకునేందుకు ఏప్లానులూ పన్నెయ్యకపోయేసరికి 'కాలం కలిసొస్తే తప్ప మనచేతిలో ఏమీ లేదు' అనే వేదాంతపూరితమైన ఏకగ్రీవ నిర్ణయాని కొచ్చేశారిద్దరూ–తక్షణమే. అందువల్ల కాలాన్ని మళ్ళీ మామూలుగానే మాస్టారితోబాటు నెట్టుకుపోవడం మొదలెట్టారు.

నాల్రోజులు గడిచాయి.

అవతారం స్నానం చేసుండగా, బాత్‌రూం బయట నిలబడి, ఇంటిలో డబ్బు 'నిల్లే' అనీ, బ్యాంకుకెళ్ళి డబ్బు తేకపోతే మనపని 'దల్లే' అనీ, మర్నాటి సంతర్పణకూడా 'ఇల్లే' అనీ ప్రాసపూర్వకమైన హాస్య

'ఏమండీ. మరో నవల రాస్తున్నానన్నారు; పూర్తయిందా?'

'లేదండీ. ఓ వంద పేజీలు రాసి అక్కడ పెట్టేను; మా రెండో అబ్బాయి చింపి పారేశాడు.'

'మీ రెండో అబ్బాయి నవలలు చదివే అంతవాడయ్యాడ్టండీ!'

రపంతో అవతారానికి నివేదించింది సుందరమ్మ.

'ఆదేం ముడియాడు' అని అవతారంకూడా అరవహాస్యం మాట్లాడాడు చెంబుడునీళ్ళు నెత్తినపోసేసుకుంటూ. ఇద్దరూ తమ తమ హాస్యాలకు కడుపుబ్బ నవ్వుకోసాగారు.

'అమ్మాయ్! సుందరమ్మా' అనే కేక వినబడి పరుగెత్తింది సుందరమ్మ

తెల్లని ఇస్త్రీబట్టల్లో దూరిపోయి, ఓ సంచీని కుడిచేతికి వ్రేలాడేసుకున్న మాష్టారు కనిపించారు.

'ఏమిటి బాబాయిగారూ?'

'ఏం లేదమ్మా! అర్జెంటుగా ఊరెళ్తున్నాను. రాత్రిగ్గాని, రేపు ఉదయానికిగాని వస్తాను. ఎందుకైనా మంచిది. రాత్రికికూడా నాకుబియ్యం పోయకు. అంతగ్గాకపోతే వచ్చాక చూసుకోవచ్చు' అంటూ హడావిడిగా వెళ్ళిపోయారు.

ఆ కాస్త భాగ్యానికే సుందరమ్మ ఏలిన్నాటిశని వదిలిందన్నంత సంతోషంతో తల తుడుచుకుంటున్న భర్త దగ్గరికి పరుగెత్తి, ఈ వార్త తేనెసోనలవంటి పలుకులతో చెప్పేసింది.

అవతారం వళ్ళు తెలియని ఆనందంలో నేలమీద నాలుగు పిల్లిమొగ్గలు కొట్టి, దూలంపట్టుకొని వుయ్యాలలూగి, తలక్రిందులుగా వ్రేలాడి పావలాకాసు సినిమా ప్రేక్షకుడు వేసేమాదిరి ఈలవేసి, కొద్దిగా తైతక్కలాడి, ఎదురుగా వున్న సుందరమ్మను నడుం పట్టుకుని పైకల్లా ఎత్తేసి, గిరగిరా తిరుగుతూ కళ్ళు తిరిగిన కారణాన బోర్లా బడిపోయి, మళ్ళీలేచి, చట్టు విరిగినట్టు బాధపడుతున్న సుందరమ్మను ఆ



బుగ్గా ఈ బుగ్గా గంటుపడేలా గిల్లి, ఇంకా ఏదో చేయబోయేసరికి-

'ఇక చాలుగానీ నిడవాకం — బ్యాంకు కెళ్ళిరండి' అంటూ సుందరమ్మ అతని దూకుడు కడ్డంపడింది.

'ఓనోయ్! మర్చేపోయాను' అని గబగబా చెక్కు రాసుకుని బ్యాంకుకు పరిగెత్తాడు.

'సారీ మాస్టారూ! మీ చెక్కును గౌరవించలేము' అన్నాడు బ్యాంకు గుమాస్తా.

దిమ్మదిరిగిపోయిందవతారానికి. బుర మొద్దుబారినట్లనిపించింది. కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు దయచేశాడు.

సాయంత్రం ఇంటికి రాగానే 'డబ్బు తెచ్చారా?' అనడిగిన సుందరమ్మ ప్రశ్నకు సమాధానంగా వెల్లకిలా మంచాన పడిపోయి, ఇంటి దూలాలు పరీక్షిస్తూ-

'డబ్బూలేదు దస్కంలేదు! నీ మాటే ఖాయం' అన్నాడు.

సుందరమ్మ మనస్సు చివుక్కుమంది. అంతలోనే మొహంలో ఓ వింతకళ తెచ్చుకుని, 'ఏమండీ! అధైర్యపడకండి! ఆదిలక్ష్మమ్మగారు మనకి ముప్పయి రూపాయలదాకా ఇవ్వాలి. రాత్రికి మాస్టారు రాగానే అడిగి తీసుకుందాం. రేపటికి జరిగిపోతుంది. మళ్ళీ సంతర్పణ నాటికి జీతాలే వస్తాయి' అంటూ సముదాయించిందవతారాన్ని.

అవతారం అధైర్యపడ్డం మానేశాడు.

రాత్రి 11 గంటలయినా మాస్టారు రాలేదు. మరి వచ్చే సూచనా లేదు.

మళ్ళీ అవతారం అధైర్యపడ్డం మొదలెట్టాడు 'రేపు సంతర్పణ ఫెయిలే' అని.

'మీ మిత్రుల్ని అప్పడిగి చూడండి. ఉదయమే వెళ్ళి. మాస్టారొచ్చాక అప్పు తీర్చెయ్యొచ్చు' అంటూ ధైర్యం నూరిపోసింది సుందరమ్మ. అది తాగి పడుకున్నాడవతారం.

సూర్యోదయం కాకుండానే అవతారం సర్వయ్య దగ్గరకెళ్ళి అడిగేశాడు—

'ఓ ముప్పయ్యుంటే సర్దరా! మాస్టారొచ్చాక తీరుస్తానూ' అని.

'హరెరె! ఇప్పుడే ఓ 50 యాభై రూపాయలుంటే బీ. డీ. వో. గారి కిచ్చొచ్చానా! వెరీసారీ! చొ చొ చొ' అంటూ బాధపడి ఆలోచించి, 'ఒరేయ్! కైలాసంగాడు నిన్ననే ఓ 70 రూపాయలు తీసుకెళ్ళాడురా బ్యాంకునుంచి. వెంటనే వాణ్ణి పట్టేయ్... ఊ... కదులు' అంటూ మార్గదర్శకత్వం వహించి తోసివేశాడు సర్వయ్య.

అవతారం గబగబా కైలాసం దగ్గరి కెళ్ళాడు.

'పెహారి పిచ్చాడా! ఆ డెబ్బయి రూపాయలు నావికావురా నాయనా! మా ఇంటి యజమానివి. దాచి పెట్టి మంకేనూ, ఎలాగూ బ్యాంకులో మనపేర ఓ ఎకౌంటుంటూ వుందిగదా అవంటూ అని దాచిపెట్టాను. నిన్ననే ఆయన కావాలని అడిగితేను తెచ్చి రాత్రే ఇచ్చేశానన్నమాట' అని ఫెళఫెళ నవ్వేసి, 'అయినా ఇవాళ అచారిగాడి సంతర్పణ గదరా! వాణ్ణి అడగలేకపోయావూ ?... వెధవ! వారం రోజుల్నుంచీ పార్టీల దగ్గర మహా గుంజేస్తున్నాడు. పోయడుగు. జీతాలు రాగానే వాడిమొహాన గిరవాటేద్దువుగాని' అని ఓ సలహాయిచ్చి, 'పరే వస్తా రా! ఇల్లంతా నానా గందరగోళంగానూ వుంది సర్దాలి' అంటూ లోపలికి పారిపోయాడు కైలాసం.

అవతారం ఒక్కక్షణం అలాగే నిలబడిపోయి 'దొంగ వెధవా!' అని తిట్టుకుని, ఆపైన నెమ్మదిగా అచారింటికి వెళ్ళాడు.

ఇంటిముందు నిలబడి మంచాన్ని నేలకేసికొట్టి, రాలిన నల్లుల్ని కాల రాస్తున్న ఆచారి, అవతారాన్ని చూడగానే మొహం చేటంత చేసుకుని, చిరునవ్వు నవ్వుతూ 'రారా! కూర్చో' అంటూ మంచంవాల్చి కూచోబెట్టి 'మంచినీళ్ళుకావాలా?' అనడిగి, 'వద్దు' అనిపించుకుని,

'నే నే నీ కో సం వద్దామను కున్నారా పొద్దున్నే' అన్నాడు.

'ఎందుకూ?' అన్నా డవతారం ఆశగా కళ్ళు పెద్దవిచేసి.

'ఎబ్బే .. ఏం లే దు రా! మా యావిడ 'అప్పుచేసి పప్పుకూడు' సినిమాకి మార్నింగ్‌షోకి వెళ్ళాలని ఊహు గోల చేస్తోంది. అదిచూసి అట్నించటే భోయనాని కొచ్చేస్తాం. కాస్త ఆలస్యం అవుతుంది అని చెప్ప డానికి' అన్నాడాచారి.

చప్పబడిపోయా డవతారం.

మళ్ళీ ఆచారే అందుకున్నాడు 'ఇంతలోకే సర్వయిట్యూస్తేనూ! అగి పోయా నన్నమాట! పాపం నీ సంగ తంతా చెప్పాడ్రావాడు. నా కెంత బాధ కలిగిందో చెప్పలేను. ఈ చుట్టు పక్కల అయిదారు ఇళ్ళల్లో నీ కోస మని చేబదుళ్ళడిగా! అంతా దొంగ వెధవలే! ఉండీ లేదన్నారు. పీనాసి పీనుగులు ...' అని అవతారం వంకచూశాడు.

అవతారం ఎక్కడో దూరంగా శూన్యంలోకి చూస్తున్నాడు.

'అప్పట్నించీ ఏం చెయ్యాలా, నీ కష్టమెలా గట్టెక్కించాలా? అని బుర్రబద్దలు కొట్టుకుంటున్నాననుకో. ఇప్పుడే బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది' అన్నాడాచారి.

అవతారానికి ఏదో వెలుగు కనిపించినట్లయింది. ఆచారి చేతులు పట్టుకొని "ఏమిట్రా అది? చెప్పరా?" అని ప్రాధేయపడ్డాడు.

"ఏం లేదురా! రంగనాథం వీధిలో 'అప్పాలాల్ సప్పాలాల్' అని టాకట్టు వ్యాపారస్తులున్నారు చూడు..." అని చెబుతుండగానే—

అవతారం అదిరిపడి లేచి "వస్తారా" అంటూ పరుగు లంకించుకున్నాడు.

ఆచారి పదడుగులు వెనగ్గా పరుగెత్తుతూ "ఒంటిగంటవ్వకల్లా వచ్చేస్తాంరోయ్" అని ఎలుగెత్తి అరవసాగాడు.

ఇంటికెళ్ళేసరికి వీధిలో నిలబడి ఎదురుచూస్తున్న సుందరమ్మ విషయం తెలుసుకుని, చింతించి "ఏం స్నేహితులండీ" అంటూ ఓ చిన్న రిమార్కు పారేసి, మాష్టారొచ్చారనీ, కొంత పైకాన్ని కావడిపెట్టెలో దాస్తూండగా తాను చూశాననీ వెంటనే అడగమనీ అవతారానికుపదేశించింది.

అవతారం ఏనుగంత సత్తువ తీసుకుని, గుర్రమంత దౌడుతీశాడు మాష్టారి దగ్గరకు "ఎప్పుడొచ్చారు మాష్టారూ?" అంటూ.

డాక్టరు :- రంగారావు పడకయ్యా బాబూ! ఈ జబ్బు నాకూ ఓసారొచ్చింది; నేను బాగుపడ్డానుగా!

పేషంట్ :- మీ డాక్టరు వేరు కదండీ.

"ఇప్పుడే వచ్చాను బాబూ! రాత్రే వద్దామనుకుంటే బస్సు దొరికింది కాదు" అన్నారు తాపీగా పడక్కుర్చీ నలంకరిస్తూ.

"అరెరె! పాపం! మేము మీకోసం రాత్రంతా కాచుకున్నాం సుమండీ" అని జాలినటించి, ఆయన చెవి దగ్గరగా వెళ్ళి "ఓ ఖర్చుంటే సర్దుతారు మాష్టారూ! మళ్ళీ జీతాలురాగానే తీర్చేస్తాను" అన్నాడు రహస్యంగా.

"అయ్యో! నీకు తెలియని డబ్బు నా దగ్గరెక్కడుంది నాయనా? నేనే నిన్నో ముప్ఫయ్యడుగుదామనుకుంటున్నా చేబదులుగా" అన్నారు మాష్టారు చిరునవ్వు లొలకబోస్తూ— అంతకన్నా రహస్యంగా.

చిరాకేసిం దవతారానికి.

"అదిగాదు మాష్టారూ! మీ దగ్గిర మాత్రం లేకుండావుందా? మీకీ మధ్య ఖర్చేలాగూ లేదాయె. పోనీ, పెద్దమ్మగారు మా దగ్గిర ఎప్పుడన్నా తీసుకోసింది ముప్ఫయిదాకా బదులు తీసుకున్నారు. అదన్నా ఇప్పించండి.

"మీ సొమ్మేమీ ఇవ్వద్దు" అన్నాడు ప్రాధేయపూర్వకమైన కసితో.

'అబ్బ! లేదు నాయనా అంటే నమ్మవేంటి ఒట్టు. లేదుబాబూ! భజంత్రీవాణ్ని పిలిపించి గుండు గీయించుకుందామంటే పావలా డబ్బుల్లేక గిలగిల్లాడి పోతున్నాను. నీకేం తెలును నేనెంత గడ్డి కరుస్తున్నానో! నీబాకీ వచ్చే నెలలో తప్పక జమకడతాను. కావాలంటే ఇకో పదో వరకో కూడా తీసుకో! నే వద్దనను' అన్నారు మాష్టారు మొత్తుకుంటూ.

అవతారానిక్కోపం ఎక్కువయింది — పొద్దుట్నించీ పొందిన ఒక్కొక్క అనుభవం వల్లాను. అదంతా మాష్టారిమీదకి మళ్ళించాలని ప్రయత్నంలో పడ్డాడు.

"పోనీ, ప్రతి సెలవునాడూ బంధుమిత్ర సపరివారంగావచ్చి పీకెలదాకా మెక్కిపోయే నీ మిత్రులున్నారుగా! వాళ్ళనడిగి చూడరాదూ?" అంటూ ఓ సలహా ఇచ్చారు మాష్టారు ఈలోగానే!

అవతారం కోపంతో పగిలిపోయాడు.

"ఎవ్వళ్ళు తక్కువ మెక్కలేదులెండి! మీరు చూపించిన మొండి చేతులే వాళ్ళూ చూపించారు. మీలాగానే వాళ్ళూ సలహాలు తగలేశారు నా మొహాన' అంటూ ఒక్క పోటు పొడిచాడు... మాష్టారికి నషాళం అంటాలని.

మాష్టారికి నషాళం అంటలేదు. పైగా 'అభాగ్యానికి మొండిచేతులను కుంటే ఎలా? ఎవరి కష్టాలు వాళ్ళకుంటాయి మరి' అని సాగదీస్తూ మరింత వెనక్కి వాలారు కుర్చీలో.

అవతారానికి రోషం, ఉక్రోషం పెల్లుబికాయి. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

జీరపోయిన గొంతుకతో "అవునేండి! మీ అందరివీ కష్టాలు! నావి మాత్రం సుఖాలు. నేనేమైపోతానో అనికూడా చూడకుండా పొట్టలు పగిలేలా ఎద్దుల్లా మేశారు పైగా రుచులు! నేతి పిండివంటలు! అసలింతకీ ఎవర్నని ఏం లాభంలేండి! నాది బుద్ధితక్కువ! నాదండీ బుద్ధి తక్కువ! పోనీగదాఅని జాలిదలచి నెత్తికెక్కించుకుని మేపానుగదూ? నాకీ శాస్తి కావలసిందే" అంటూ ఠపఠప లెంపలు వాయించుకోసాగాడు.

మాష్టారు చిరునవ్వు నవ్వుతూ "ఎందుకయ్యా అంత ఉద్రేకపడతావు? పెట్టిదెప్పడం మహాపాపం కూడాను. కాస్త శాంతించు" అన్నారు తాపీగా.

"శాంతి!... హు... శాంతి!... ఇంకెప్పుడూ ఇలాటి అనవసర సంతర్పణలు చెయ్యకుండా వుంటే నే




నాకు శాంతి మాష్టారూ! నాకు శాంతి' అంటూ గుండెలు బాదుకో పోగా డవతారం.

'బాగుందయ్యా! సినిమా హీరో లాగా నీ సంభాషణలూ నువ్వూను' అంటూ విరగబడి నవ్వడం మొదలెట్టారు మాష్టారు.

'సినిమా హీరోలాంటి వాడు కాదండీ ఈ అవతారం! హెం! ఏమనుకున్నారో! మాటన్నానంటే తిరుగుండదు. చూడండి! ఇదే ప్రమాణంచేసి చెపుతున్నాను. ఎవరి మీదో కాదు. ఏ వెంకటేశ్వరస్వామిని నా నెత్తినపెట్టి సంతర్పణలు చేస్తానని ప్రమాణం చేయమన్నారో నా విశ్వాసఘాతుక మిత్రులు— ఆ దే వెంకటేశ్వర స్వామిమీద! ఇహ నుంచీ తద్దినాల్లాంటి ఇలాటి మిత్ర సంతర్పణలూ, మొహమాటపు విందులూ చెయ్యనుగాక చెయ్యను. చేస్తే పెద్ద ఒట్టే' అని గోడమీది స్వామిపటంమీదచేయివేసిప్రమాణం చేశాడు అవతారం.

మాష్టారు ఆనందంతో ఎగిరిలేచారు కుర్చీలోంచి.

'నాయనా! ఈ మాట తప్పవు గదూ?' అంటూ.

'ఛస్తే తప్పను. ఇటుసూర్యు డటు పొడిచినా సరే! మహాప్రళయం సంభవించినాసరే! కోటి రూపాయలు ముదనష్టం తగిలినా సరే! నా ప్రతిజ్ఞ కింక తిరుగులేదు' అన్నాడు తలుపు మీద ఘట్టిగా గుద్దుతూ.

'వెరీగూడ్ బాబూ! ఇంతకాలం నీకీ పైరివెటు చెప్పాలనే నేనూ, నాతోబాటు మా యావిడా కూడా తాపత్రయపడ్డం. మా ప్రయత్నం ఫలించింది. ఇదిగో నీ కొవలసిన డబ్బు' అని కావిడి పెట్టెలోంచి ఒక 50 రూపాయలుతీసి అవతారం చేతిలోపెట్టి, 'నీ బాకీ ముప్ఫయి రూపాయలూ తీసుకో! మిగతా

ఇరవై రూపాయలూ నువ్వు నాకు తిరిగివ్వక్కర్లేదు. అమ్మాయికి చీరె పెట్టాలని మా యావిడ కెన్నాళ్ళ నుంచో కోరిగ్గావుంది. ఆమె కిష్టమైంది ఎన్నుకుని తెచ్చుకుంటే రేపు అది రాగానే దాని చేతులమీదుగా పెట్టుకుని సంతోషిస్తుంది.

మే మిద్దరం ఆడిన ఈ నాటకం చాలా విజయవంతమైంది. చాలా సంతోషం నాయనా! లోకంతీరు గమనించి నడుచుకో! ముందు నీ క్షేమమూ, నీ ఇంటి క్షేమమూ చూచుకోవడం నేర్చుకో! అంతే ఎవరికీ కష్టం కల్గించకుండానే. అనవసరపు పొగడ్తలకు మోసపోయి పీకెల మీదికి తెచ్చుకోకు. ఇవాళనుంచే నీ మిత్ర సంతర్పణలు రద్దుచేసేయ్" అని ఉపదేశించారు మాష్టారు.

అవతారం తన కళ్ళనీ చెవుల్నీ తనే నమ్మలేకపోయాడు.

ఒక్కనిముషం అలాగే మాష్టారి వంకచూసి, కళ్ళవెంట నీరు కారుతుండగా హఠాత్తుగా మాష్టారి పాదాల మీద వాలిపోయాడు–భక్తితో, కృతజ్ఞతతో.

వాత్సల్యంతో లేవనెత్తి కన్నీరు తుడిచి, వీపునిమిరి ధైర్యం చెప్పారు మేష్టారు.

మరో అరగంటలో

'ఈ రోజునుంచీ 'మిత్ర సంతర్పణలు' అనే పేరుగల 'విశ్వాస ఘాతకుల తిండి' రద్దుచేయడమైనది.'

ఇట్లు,

ఇప్పుడే కళ్ళు తెరిచిన

అవతారం.

అనే ఎర్రటి అక్షరాలతో లిఖించబడినబోర్డు వీధి గేటుకు వ్రేలాడదీయబడింది.

బోర్డు చదువుకున్న మాష్టారు తృప్తిగా నిట్టూర్చి పోస్టాఫీసు కెళ్ళారు–మహాలక్ష్మమ్మగార్ని వెంటనే బయల్దేరి రమ్మని టెలిగ్రాం ఇచ్చేందుకు.

□□□

ఎనభై పైసలకు మీరు కొనగలిగిన వస్తువు లన్నిటిలో ఉత్తమమైనది